# స్టాండ్ బై

డోర్ తోసుకుని స్టూడియోలోకి అడుగుపెట్టింది శశికళ. బరువుగా, మెత్తగా స్ప్రింగ్‌డోర్ మూసుకుంది. పక్క స్టేషన్ నుండి వస్తున్న కార్యక్రమం రిలే అవుతోంది. శశికళ చేతిలో పేపరు డెక్‌మీద పెట్టి క్యూషీట్ చూసుకుంది. ఇది పూర్తవగానే ప్రసారం చెయ్యాల్సిన కార్యక్రమంలో వేయాల్సిన పాట డిస్క్ తీసుకుని చూసింది.

“ప్రేమంటే తెలుసా నీకు ?”

అంతవరకు ఆ పాట రికార్డు చూసినా, విన్నా నవ్వొచ్చేది. కానీ ఈ వేళ దుఃఖంగా, కోపంగా, కసిగా మనసు విలవిల్లాడిపోయింది. నిజంగా ప్రేమంటే ఏమిటి ? కంటికి కనిపించకుండా వంచించి బాధించే ఆ ప్రేమ అనేది ఎక్కడుందో ఎవరికి తెలుసు ? అసలుందో లేదో అనుకోటానికి వీల్లేకుండా ఎప్పుడూ వున్నానంటూ ఏడిపించుకుతింటుంది. ప్రేమంటే తెలుసా నీకూ అంటూ గొంతు చించుకుంటే తెలీదని ఎవరనగలరు ? పోనీ తెలుసని మాత్రం ఎవరు చెప్పగలరు !

రిలే కార్యక్రమం ముగింపు కొచ్చింది. అది కట్ అయి రెడ్‌లైట్ వెలగంగానే ఫేడర్ తీసి, ఆకాశవాణి.... కేంద్రం ఇప్పుడు.... కార్యక్రమం వింటారు అని సిగ్‌నేచర్ మ్యూజిక్ పేసి తల విదిలించుకుంది శశికళ.

ఈమధ్యనే రేడియోలో ఎనౌన్సర్‌గా వుద్యోగంలో చేరింది శశికళ. చేరినప్పటినుండి, కొత్త జీవితం, కొత్త ఆశలు—జీవితం ఉత్సాహంగా

ముందుకు కదులుతుంటే నలుగురిలో తనకీ గౌరవం, విలువ వున్నాయనీ, తను తనుగానే బ్రతకగలదని ఆత్మస్థయిర్యంతో రోజులు గడుపుతోంది శశికళ.

మూడేళ్ళ పిల్లగా వున్నప్పుడు పోలియోవల్ల లాగేసిన కాలు శశికళలోవున్న అందమంతా బూడిదలో పోసిన పన్నీరు చేసింది. దానికి తగ్గట్టుగా చిన్నప్పటినుంచి అంతా చూపించే సానుభూతి, జాలి మనసుకి అవమానంతో చిన్నబుచ్చేవి. అలాంటి జాలిమాటలు వింటుంటే ఆమెకి చాలా చిరాకుగా వుండేది. అన్నిటికి మించిన అవమానం "అసలే ఆడపిల్ల - పాపం! కల్యాణయోగం వున్నట్లులేదు" అని కొందరు ముఖంమీదే అంటుంటే భరించలేకపోయేది. అయినా భరిస్తూ, కసిగా చదువుతూ అన్ని క్లాసులూ మంచి మార్కులతో ప్యాసయింది. కాలు వంకరైనా కలలుగనే వయసుకి మనసుకి కొదవలేకుండా ఎన్నో రంగుల కలలు కనేది.

రాజాతో పరిచయం. అతను తనయందు చూపుతున్న ప్రేమాను రాగాలకు శశికళ పేదమనసు ఉబ్బి తబ్బిబ్బయిపోయింది. నిజానికి తనకి కాలువంకర. తన నడక ఎత్తి ఎత్తి వేస్తున్న అడుగులతో అవకరంగా కనిపిస్తుంది. కాని తన నడకలోని నిశ్చలత గొప్పతనం ఎవరైనా ఎప్పుడైనా గుర్తించి, అర్థంచేసుకోకపోతారా అని ఊహించుకునేది. ఇన్నాళ్ళకి తన కలలు నిజమయ్యాయని ఆరోజు మురిసిపోయింది.

రాజాతో పరిచయమైన కొత్తలో ఎంత పులకించిపోయింది తను? తనకి తెలియకుండానే రోజు రోజూ పరిచయం పెరిగిపోయింది. ఇంట్లో ఎవ్వరూ గ్రహించని విధంగా తనే చాలా జాగ్రత్తపడింది. వాళ్ళకి తెలిస్తే మందలిస్తారనికాదు హేళన చేస్తారు. మొదట తల్లే సణుగుడు మొదలు పెడుతుంది.

" అందని ఆశలకిపోక – నీ దారిన నువ్వుండు దేనికైనా నుదుటి రాత, యోగ్యతా వుండాలి " అంటూ సాగదీస్తుంది. ఆ విదిలింపు, ఆ వైరాగ్యపు ధోరణి శశికళని నిలువునా కృంగదీస్తూంటాయి.

అయినా రాజాతో తనకి స్నేహం అపురూపంగా భావించుకుంది. ఆనందపడిపోయింది.

ఫైనలియర్ పరీక్షల సమయంలో ఏదో నోట్ బుక్ కోసం విమల యింటికి వెళ్ళినప్పుడు రాజాని తను మొదటిసారి కలుసుకుంది. ఎన్నో కబుర్లు, జోక్స్, క్షణాలు, గంటలు తెలీకుండా గడిచిపోయేవి. అతని సాంగత్యంలో అపురూపమైన ఆనందం అనుభవించేది. ప్రపంచాన్ని జయించిన తృప్తి, దేవుడు రాసిన నుదుటిరాతను చెరిపేసిన విశ్వాసం, అదృష్టాన్ని ఆపేవారెవరూ లేరనే ఆశ. ఆమెలో క్షణం క్షణం ఊపిరిలో కలిసి వృక్షాలుగా మారిపోయాయి.

ఆరోజు రాగిణి కడపనుంచి వచ్చినప్పుడు తను ఎంతో ఆనందపడి పోయింది. నిజానికి రాగిణి మామయ్య కూతురైనా సొంత అక్కచెల్లెళ్ళ కంటే తనకి దగ్గర. తనంటే ప్రాణం పెడుతుంది. తనని తక్కువగా, జాలిగా చూడదు. సమానంగా చూస్తుంది.

ఆరోజు సాయంత్రం రాగిణిని రాజాకి చూపించి పరిచయం చేసేవరకు శశికళ ఒక్క నిముషం నిలువలేకపోయింది.

ముగ్గురూ కలిసి ఎన్నిచోట్లకని తిరిగారనీ– ? హోటళ్ళు, షికార్లూ, సినిమాలు ఒకటేమిటి ? ఎన్ని చర్చలు ? ఎన్ని వాద ప్రతివాదాలూ ? ఎన్ని సినిమా కథలు ? ఎన్ని చెత్త నవలలు ? ఎన్ని ఆశయాలు– ఒకటేమిటి ! ఆరోజు తను భూమికి గజం ఎత్తులో గాలిలో నడిచింది. పక్కన రాగిణి వుండటంతో శశికళ మరీ స్వేచ్ఛగా ప్రవర్తించింది. ఎవరో చూస్తున్నారన్న భయం లేకుండా ప్రపంచాన్ని జయించిన అనుభూతి పొందింది. ఆరోజు గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది.

వారం రోజులు రాగిణి వున్నప్పుడు ఏ రోజు కారోజు రాజా తనని ప్రేమిస్తున్నాడనీ, పెళ్ళిచేసుకోబోతున్నాడనీ చెప్దామనుకుంటూనే గడిపేసింది. తనలోని సిగ్గు, అడతనం ఆ మాటలు చెప్పనీయలేదు. ఆమె వెళ్ళగానే ఉత్తరం రాద్దామనుకుంది.

రాగిణి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిననాటినుండి, రాత్రి మంచంమీద వెల్లకిలా పడుకుని ఎన్నో ఉత్తరాలు ఆమెకి రాస్తున్నట్లు వూహించుకుంటూ పుత్రూతలూగింది - ఏ రోజు కారోజు రేపు రేపు అనుకుంటూనే వుండిపోయింది.

తీరా నెల్లాళ్ళు తిరిగేసరికి మావయ్య ఊడిపడ్డాడు. వస్తూనే మామయ్య అన్న మాటలకి తను స్థాణువులా వుండిపోయింది.

"ఏమే! ఆ రాజారావనే కుర్రవాడు మంచివాడేనా? నీకు తెలుసటగా" అని-. తర్వాత మాటలు విని శశికళ నిశ్శబ్దంగా వుండిపోయింది. కథ తిరగబోయే మలుపుకి తను ఇరుసుగా నిలబడినట్లనిపించింది.

తను పెద్దగా సిఫార్సు చెయ్యాల్సిన పనేమీ లేదని గ్రహించింది. మనసులో మారుమూల ఆశ తళుకుమంటోంది. రాజా ఈ విషయం విని తుళ్ళిపడతాడు. "లేదు లేదు నా మనసెప్పుడో శశికళకి అంకితమై పోయింద"ని చెప్పినప్పుడు ఈ మావయ్యతోబాటుగా, ఇంట్లో వాళ్ళందరి ముఖాలూ చూడాలని సరదా పడింది. కాని సాయంత్రం మావయ్య తిరిగివచ్చి చెప్పినదాన్నిబట్టి నిశ్చేష్టయిపోయింది. మావయ్య రాజా గుణగణాల్ని నిలువెల్లా పొగుడుతుంటే తన గుండెల్లో రేగిన మంటలకి విలవిల్లాడిపోయింది.

తన కళ్ళముందే రాగిణీ, రాజాకి పెళ్ళి కుదిరిపోయింది. ఆ సాయంత్రం తను ఆవేశంతో దుఃఖంతో రాజాని కలిసింది. మాటలతో కడిగేసింది.

" నువ్వెందుకు బాధపడుతున్నావో నా కర్థం కావడంలేదు. బాధపడాల్సిందీ యిందులో ఏమీలేదు. నీ అందం చదువు చూసి నిన్ను ప్రేమిద్దామనుకున్నాను. నీ అవకరాన్ని పక్కకి పెట్టి పెళ్ళిచేసుకుందా మనుకున్నాను. నీ అవకరాన్ని బట్టయినా నీకు మంచి వుద్యోగం వస్తుందని తెలుసు. వచ్చింది కూడా-నీ కన్నా అన్నివిధాలా అధికురాలు నన్ను వలచి వస్తే ఆమెని ఎన్నుకోవడంలో నా తప్పేమిటో నాకు తెలియడంలేదు-నిజానికి నీమీద నా మోజు తీరనేలేదు. నిన్ను వదలేయను. మన మైత్రి యిలాగే కొనసాగుతుంది. నా మనిషిగా నిన్ను వుంచుకుంటాను" అతని మాటలు పూర్తవుతుండేనే.

" ఛీ ! సిగ్గులేదూ అలాంటి మాట లనడానికి " అంటూ ఒక్క-క్షణం అక్కడ నిలబడకుండా వచ్చేసింది.

" ప్రేమిద్దామనుకున్నా " అన్న మాటలు ఆమె హృదయాన్ని తూట్లు పరిచాయి. ఇంతకాలం ప్రేమించలేదా ? చేసిన వాగ్దానాలన్నీ సరదా కబుర్లా ? లేక మోసకారి మాటలా ! ఇది పచ్చిమోసం, దగా. కానీ ఏ న్యాయస్థానం దీనికి న్యాయ నిర్ణయం చెయ్యలేదు. పగిలిన తన హృదయానికి జురిమానా కట్టించలేదు. కారాగార శిక్ష విధించలేదు. కనీసం ఎవరితోనైనా చెప్పుకున్నా తప్పు తనదే అంటారు. అది మరింత దుఃఖం.

తనతో ప్రేమ కలాపాలు సాగిస్తూనే రాగిణితో ప్రేమలేఖలు నడిపించి దానికి ప్రేమని పేరు పెట్టాడు. తనీ విషయం రాగిణికి ఎలా చెప్తుంది. తన ప్రాణంలో ప్రాణంగా మసలిన రాగిణి యిప్పుడు రాజా మైకంలో తనని అపార్థంచేసుకున్నా చేసుకోవచ్చు. అయినా తను అవమాన భారంతో కృంగిపోయి వుంది. ఎవరికీ ఫిర్యాదు చేసుకునే ఓపిక కూడా లేదు.

రాగిణి వివాహం పూర్తయిన తర్వాత మిత్రుల కిచ్చిన పార్టీలో వారిద్దరిదీ ప్రేమ వివాహంగా అభివర్ణిస్తుంటే ఆశ్చర్యపోతూ, ఆవేదన పడిపోతూ వూరుకుండిపోయింది.

పాట అయిపోయింది - తరువాత కార్యక్రమం ఎనౌన్సుచేసి, టేపు ఆన్ చేసింది.

ఇంతలో ఎవరో డోర్ తీసుకొచ్చారు. చటుక్కున చూసింది. మదన్. లేని నవ్వు తెచ్చుకుని విష్ చేసింది.

" శశికళగారూ! రేపు ఓ. బి. ప్రోగ్రాముకి మీరు నాకు అసిస్టెంట్. ఆ నెమలి పాట, డ్యాన్సు కోసం చేశాం చూడండి, అది రెండు టేపులమీద డబ్ చెయ్యండి "

" రెండా ? "

" అవునండీ స్టాండ్ బై టేపు లేకుండా వుంటే మునిగిపోతాం- స్టాండ్ బై-కోసం " అన్నాడతను నవ్వుతూ — ఆ నవ్వులో ఏదో అర్థం- ఇద్దరు బిడ్డల తండ్రి, సలక్షణమైన భార్య వున్నతనికి స్టాండ్ బై కావాలి. " అలాగేనండి సాయంత్రం చేస్తాను " అంది నెమ్మదిగా. మదన్ తప్పేసుకుంది. సాధారణంగా మగాళ్ళందరికీ స్టాండ్ బై కావాలి మరి.

శశికళ విషాదంగా నవ్వుకుంది. రేడియోలోనే కాదు జీవితంలో కూడా స్టాండ్ బై పెట్టుకోవాల్సిన రోజులివి—అనుకుంది.